క్లుప్తంగా

ఐఏఏ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రాజేందర్



కేయూ క్యాంపస్: ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ రాజేందర్ ఎన్నికయ్యారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించిన ఇండియన్ అకౌంటింగ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో రాజేందర్‌ను ఎన్నుకున్నారు. ప్రస్తుతం రాజేందర్.. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ చాప్టర్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాశ్

వరంగల్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా జన్ను ప్రకాశ్ ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. ఈ నెల 14, 15వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని తుర్కాంజల్‌లో సీఐటీయూ యూనియన్ 5వ మహాసభ జరగగా, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా బి.కోమల, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఓరుగంటి జీవన్, కుమార్ సింగారపు కృష్ణ, రాచపల్లి సాంబయ్య, జలగం కుమారస్వామికి రాష్ట్ర కమిటీలో చోటు లభించింది.

భవన నిర్మాణ అడ్వైజరీ కమిటీ

హన్మకొండ అర్బన్: భీమారంలో డిస్ట్రిక్ట్ పద్మశాలి సంఘం వరంగల్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన పద్మశాలి సంఘ స్థలంలో భవన నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజుతో కూడిన 76 మందితో కమిటీ వేశారు. అందులో 40 మంది అడ్వైజరీ కమిటీగా, మరో 36 మంది ఆర్గనైజింగ్ కమిటీగా పేర్కొంటూ జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గద్దం భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో మహిళా యూత్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



కాజీపేట: ఒకవేళ ఆకస్మాత్తుగా గుండెపోటు వస్తే చేపట్టాల్సిన సీపీఆర్‌పై కాజీపేట మండలం సోమిడి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ కె.అనిత బుధవారం అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం శోభారాణి, వైద్య సిబ్బంది పి.జ్యోతి, బి.అశోక్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

హన్మకొండ అర్బన్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డిని రెడ్ క్రాస్ కార్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గం సభ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యుడు పుల్లూరు వేణుగోపాల్, ఇంజనీర్ సత్యనారాయణ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గీత పారిశ్రామిక సంఘం సభ్యులకు..

హసన్‌పర్తి: ఇటీవల ఎన్నికైన చింతగట్టు గీత పారిశ్రామిక సంఘం నూతన కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమం ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జనగాని సురేందర్, కార్యదర్శి ముంజ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు చింత ప్రవీణ్‌ను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో 1999 –2000 ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నద్దునూరి నాగరాజు, సభ్యులు నాగార్జున, మోడెం సుమన్, నద్దునూరి సంపత్, కోల రంజిత్, కిరణ్, సంపత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ పాదయాత్రలు

నయీంనగర్: కేంద్ర ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ ద్వారా వికసిత్ భారత్ పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు మేర యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 6న ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ జి.శివకుమార్, శ్రీధర్ సూరనేని, బానోత్ దేవీలాల్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు



వరంగల్: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి పెద్దకర్మకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కురిమి పరమేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్ వద్ద పరమేష్‌ను పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పరిచయం చేయించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- 1నుంచి 5 వరకు 46 మంది విద్యార్థులు
- అందరికీ ఒక్క గదిలోనే విద్యాబోధన
- అదనపు భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు



ఒక్క గదిలోనే విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు



కూలిపోయేలా ఉన్న పాఠశాల భవనం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఓ భవనం శిథిలావస్థకు చేరింది. దాంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళకు గురవుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 46 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ ఒక్క తరగతి గదిలోనే తరగతులు కొనసాగడం శోచనీయం. అందులోనే ఆఫీస్ రూం కూడా కొనసాగుతోంది. గతంలో ఒక భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని ఆనుకుని ఇంకో భవనం నిర్మించారు. దాంట్లోనే విద్యార్థులందరికీ బోధిస్తున్నారు.

డీఈఓ ఆదేశాలు బేఖాతరు

శిథిలావస్థకు చేరిన అయోధ్యపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలను జారీచేసి నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తక్షణమే మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని తొలగించి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే, విద్యార్థుల సంఖ్యను పెంచుకుని అదనపు భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వేడుకుంటున్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



హన్మకొండ: నివాళులర్పిస్తున్న విద్యార్థులు

హన్మకొండ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని హనుమకొండ పలివేల్పుల ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెనిశెట్టి రవికుమార్, ఉపాధ్యాయుడు రాయబారపు రవీందర్, ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ అనిత పాల్గొన్నారు.



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: అబ్దుల్ కలాం ఆశయాలు కొనసాగించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఒకటో డివిజన్‌లో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇంద్రాసేనా రెడ్డి, శ్రీధర్, రాజేష్, హరిప్రసాద్, కుమార్‌రెడ్డి, గణపతి రెడ్డి, ఇంద్రన్న, సతీష్, రాజిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

చెరువు శిఖంలో సర్వే

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని తూర్పు చెరువును రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా బుధవారం సర్వే నిర్వహించారు. 'అమ్మకానికి శిఖం భూమి' అనే కథనం 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైంది. దీంతో అధికారులు కదిలారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, శిఖంగా నిర్ధారైనట్లు వెల్లడించారు. పూర్తి నివేదికను కలెక్టర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. మత్తడి ధ్వంసంపై ఫిర్యాదు చేయనున్నారు. మత్తడి ధ్వంసం చేసినవారి పేర్లను ఎమ్మెల్యే ఆరా తీస్తున్నట్లు సమాచారం.

హోంగార్డులకు రెయిన్ కోట్ల పంపిణీ



మామునూరు: టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బుధవారం రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి హాజరై మాట్లాడుతూ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు విధి నిర్వహణలో ఉపయోగపడేలా రెయిన్ కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాస్‌రావు, వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 15 మంది పట్టుబడగా మోతాదుకు మించి మద్యం తాగిన ముగ్గురికి న్యాయమూర్తి ఫాతిమా చిన్నప్ప రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం పోలీసు సిబ్బంది పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 15 మంది పోలీసులకు చిక్కారు. వారిలో ఇనుముల రమేష్, యల్దీ పురుషోత్తం, గుల్లపెల్లి రమేష్‌కు న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. మిగిలిన 12 మందికి జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న వివరించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్



మహాసభలో మాట్లాడుతున్న రాగుల రమేష్

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో కార్మికుల హక్కులు అమలు కావడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రెండో మహాసభలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల వలన కార్మికులకు తీవ్రనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత 26 కార్మికుల చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ కేయూ అధ్యక్షుడు ఆకుతోట రాంచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, ఉపాధ్యక్షులు కచ్చకాయల చిరంజీవి, యూనియన్ ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, యూనియన్ నాయకులు దామెర రణధీర్, పల్లం రాజు, శోభ, మేకల శ్రీనివాస్, లక్ష్మి, సందీప్, ఎం.శ్రీనివాస్, రవీందర్, కృష్ణ, కిషన్, యూనివర్సిటీ ఉద్యోగులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాతున్న కాడబోయిన లింగయ్య

హన్మకొండ: గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల్లో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత నెల 15 నుంచి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. గొర్రెలు, మేకలకు రెండేళ్లుగా నట్టల మందు పంపిణీ చేయలేదని, మేత కోసం ప్రభుత్వ భూములు లేవని, ఉన్న భూములు ఆక్రమణకు గురయ్యాయని సర్వేలో తేలిందన్నారు. గొర్రెల, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న హనుమకొండ జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బండి పర్వతాలు, మిర్యాల కుమార్, గంద్రకోటి కుమార్, పిడుగు రాజన్న, దాసరి నాగరాజు, పిడుగు రాజేందర్, ఎల్లబోయిన రవీందర్, తిరుపతి, బాషబోయిన సురేష్, మడక ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న సంగని మల్లేశ్వర్, సభ్యులు

పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: బీసీ రిజర్వేషన్ల అమలుకోసం ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ పిలుపునిచ్చారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాకతీయ యూనివర్సిటీలోని పూలే ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన పాస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు, కులసంఘాలు బంద్‌లో పాల్గొని తమ ఐక్యతను చాటాలని సూచించారు. సమావేశంలో పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు బాబుయాదవ్, పాస్ నాయకులు బోళ్ల వీరప్రతాప్, డాక్టర్ వంగల సుధాకర్, నీలం ప్రనూప్ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

హన్మకొండ: బీసీలకు రాజ్యాంగబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి పిలుపులో భాగంగా హనుమకొండలోని కాళోజీ నారాయణరావు కూడలిలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించడం అన్యాయమని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, ఊట్కూరు రాములు, మునిగాల భిక్షపతి, దేశబోయిన శ్రీనివాస్, గుంటి రాజేందర్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తిని సదానందం, నేదునూరి రాజమొగిళి, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు దొమ్మటి ప్రవీణ్ కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంసుందర్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి

హన్మకొండ చౌరస్తా: బీసీ జేఏసీ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్, చొల్లేటి కృష్ణమాచార్యులు ఓ ప్రకటనలో కోరారు.

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

హన్మకొండ: హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు సంగాల మొగిలి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వివిధ రంగాల్లోని హమాలీ కార్మికులు రోజుకు 10 నుంచి 12 గంటల వరకు పని చేస్తున్నారని చెప్పారు. దాంతో అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ ఈనెల 26న హనుమకొండ అలంకార్ కూడలిలోని టీఎన్జీవోస్ భవన్‌లో హమాలీ కార్మికుల జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు దాసరి రవీందర్, పాక కుమారస్వామి, మాట్ల ప్రభాకర్, బిరబోయిన రమేష్, ఇనుగాల సుదర్శన్, ల్యాదల విజేందర్, కుమ్మరి రవి, ఇనుగాల రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ నుంచి ముగ్గురికి డాక్టరేట్



రామకృష్ణ



రాజేశ్వరి



మహేశ్వరరావు



గుట్టయ్య

హన్మకొండ కల్చరల్: వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠానికి చెందిన ముగ్గురు పరిశోధక విద్యార్థులకు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య నాగపట్ల భక్తవత్సల రెడ్డి పర్యవేక్షణలో కళింగాంధ్ర కళారూపాలు – ఒక పరిశీలన అనే అంశంపై కూన వెంకటరామకృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేష్ పర్యవేక్షణలో తెలంగాణ ప్రాంత పెరిక కుల సంస్కృతి, సంప్రదాయలు – అధ్యయనం అనే అంశంపై రాజేశ్వరి దుండె, కోయ గిరిజనుల పటం కథలు – అధ్యయనం అనే అంశంపై మహేశ్వరరావు చందా సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాలకు డాక్టరేట్ ప్రకటించారు.

ఓయూ నుంచి గుట్టయ్యకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం పరిశోధకుడు హనుమకొండ ఎర్రగట్టు గుట్ట ప్రాంతానికి చెందిన కామర్స్ పరిశోధకుడు బి.గుట్టయ్యకు ఆ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గుట్టయ్యకు డాక్టరేట్‌ను పరీక్షల విభాగం అధికారులు ప్రదానం చేశారు. ఓయూలోని కామర్స్ విభాగం ప్రొఫెసర్ చెన్నప్ప పర్యవేక్షణలో గుట్టయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వైభవంగా మైసమ్మతల్లి బోనాలు



బోనాలతో బయల్దేరిన భూపేష్‌నగర్ వాసులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని భూపేషనగర్‌లో కరాటే ప్రభాకర్, కొయ్యాడ ఉమ ఆధ్వర్యంలో మైసమ్మ, పోచమ్మ బోనాల పండుగను బుధవారం వైభవంగా నిర్వహించారు. బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య కోళ్లు, మేకలతో గుడికి చేరుకుని మైసమ్మ, పోచమ్మ తల్లులకు మొక్కులు సమర్పించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్ గుండేటి నరేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

విదేశీ విద్యాజ్యోతి పథకంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న శేషు

కేయూ క్యాంపస్: పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద ఉన్నత విద్యకోసం విదేశాలకు పంపే విద్యార్థుల సంఖ్యను ఈ ఏడాది 300నుంచి 700 వరకు పెంచడంపై బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు హర్షం వ్యక్తం చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 56శాతం ఉన్న బీసీలలో 124 కులాల నుంచి లబ్ధిదారుల సంఖ్యను వెయ్యికి పెంచితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు వెదునూరి రాజమౌళి, బుట్టి శ్యామ్‌యాదవ్, సోమిడి అంజన్‌రావు, కొమరయ్య, చాపర్తి కుమారస్వామి, చిన్నాల యశ్వంత్ యాదవ్, డేనియల్, ప్రసాద్, పాల రవి, ఐతం నగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలి

కాజీపేట: పెండింగ్‌లో ఉన్న కల్లుగీత కార్మికుల పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొని సాంబయ్య డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జరిగిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తులు అపరిష్కృతంగా పడి ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, బంగని రాజేంద్ర ప్రసాద్, రమేష్ కుమార్, విజేందర్ పాల్గొన్నారు.

'బ్రాహ్మణ బోర్డు' ఏర్పాటు చేయాలి

హన్మకొండ కల్చరల్: గతంలో ఉన్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ అర్చక సమాఖ్య జేఏసీ, బ్రాహ్మణ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును అర్చక సమాఖ్య జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, బ్రాహ్మణ సంఘాల నాయకులు వెంకటరత్నం, విలాస్‌శర్మ, రామశర్మ, డాక్టర్ వింజమూరి సుధాకర్ శర్మ, నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

దళితుల రాజ్యాధికారానికి కృషి

నయీంనగర్: దళితుల అభ్యున్నతికి పాటుపడుతూ వారికి రాజ్యాధికారం దక్కేలా కృషి చేస్తానని ఆల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ (ఏఐడీఏసీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రత్నం శైలేందర్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన తనను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రాము నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.

ఇద్దరు పిల్లల పరిమితిని ఎత్తివేయాలి

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరు పిల్లల పరిమితి ఎత్తివేయాలని గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ ధరావత్ అభిమాన్ గాంధీ నాయక్, నాయకులు గనిపాక మహేందర్, సిరిపురం కుమారస్వామి కోరారు. ఈ మేరకు హనుమకొండలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ, అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, కేఆర్.నాగరాజును బుధవారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందించారు.

గాలికుంటు వ్యాధి ప్రమాదకరం

హసన్‌పర్తి: పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. హసన్‌పర్తిలోని మండల కేంద్రంలో ఉచిత గాలికుంటు నివారణ టీకా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవళిక, బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, రైల్వే బోర్డు సభ్యుడు తాళ్ల శ్యామ్, రైతులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

కాజీపేట అర్బన్: అరుదైన లాపరోటమీ శస్త్ర చికిత్స ద్వారా తల్లి ప్రాణాన్ని కాపాడినట్లు మెడికవర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. హంటర్‌రోడ్డులోని ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ అమతుల్ హఫ్సా మాట్లాడుతూ గూడూరుకు చెందిన 21 ఏళ్ల గర్భిణికి ఇటీవల సిజేరియన్ డెలివరీ కాగా, ఎనిమిది రోజులకు అధిక రక్తస్రావంతో బాధపడుతూ మెడికవర్‌లో చేరిందన్నారు. దీంతో అరుదైన లాపరోటమీ శస్త్ర చికిత్సను నిర్వహించి గర్భాశయం తొలగించకుండా రక్తస్రావాన్ని నిలిపివేసి తల్లి ప్రాణాలను కాపాడినట్లు వివరించారు.

నరకాసుర వధకు రావాలని ఆహ్వానం

ఖిలా వరంగల్: వరంగల్ ఎంపీ కడియం కావ్యను నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 19న జరగనున్న నరకాసుర వధ వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి, గౌతం, రామ్మూర్తి, బాల కొమురెల్లి, మధు, మోహన్, ఐలేశం, శివ, సతీష్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ఖిలా వరంగల్: వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును వరంగల్ 43వ డివిజన్ బెస్తం చెరువు సబ్‌స్టేషన్ గుడిసెవాసులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమకు రక్షణ కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

నామినల్ రోల్ కరెక్షన్ చేసుకోవాలి

కాళోజీ సెంటర్: ఇంటర్మీడియట్ విద్యార్థుల పూర్తి వివరాలను ఆన్‌లైన్ లిస్టుతో సరిచూసుకోవాలని వరంగల్ డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇప్పించండి

కాళోజీ సెంటర్: రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను (బెనిఫిట్స్) వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు పలువురు ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డిని పీఆర్టీయూ కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీధర్ల ధర్మేంద్ర మాట్లాడుతూ తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, బెనిఫిట్స్ విడుదలకు కృషిచేయాలని కోరారు. నాయకులు కడారి భోగేశ్వర్, కందుకూరి దేవదాస్, గఫార్, దామోదర్, ఆర్వీ చలం, అశోక్‌కుమార్, శ్యాంరావు, సారయ్య, రాజేందర్, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్ రెడ్డి, సంజీవరెడ్డి, రవీందర్, గణపతి పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎంకు వినతుల వెల్లువ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు తనిఖీ నిమిత్తం బుధవారం వచ్చిన రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణన్‌ను అయోధ్యపురం కోచ్‌ఫ్యాక్టరీ భూ నిర్వాసితులు, రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్ మజ్దూర్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. రైల్వే యూనిట్‌లో తమ భూములు కోల్పోయామని, తమకు ఉద్యోగావకాశాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, ప్రదీప్‌కుమార్, కాయిత కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, నరేందర్, రవికుమార్, రామ, మహేష్, గ్రామస్తులు వేడుకున్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాష్, చైర్మన్ ఎస్.కె.జానిమియా ఆధ్వర్యంలో కలిసి డీజిల్‌షెడ్, డీజిల్‌కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మజ్దూర్ యూనియన్ ఈఎల్ఎస్ బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం ఆధ్వర్యంలో, రైల్ మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్ కుర్వపల్లి రవీందర్ ఆధ్వర్యంలో డీఆర్ఎంను కలిశారు.